ప్రజాశక్తి
శనివారం 5 ఏప్రిల్ 2025
5
శ్రీకాకుళం



సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : ఆధునిక యుగంలో సాంకేతికతకు అత్యంత ప్రాధాన్యం ఉందని, అందులో భాగంగానే కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యత పెరుగుతోందని జిఎంఆర్ ఐటి సీనియర్ అధ్యాపకులు సిహెచ్.విశ్వనాథ శర్మ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యాన కొత్త సాంకేతిక పరిజ్ఞానాల్లో 'ఎఐ టూల్స్ వాటి అప్లికేషన్స్'పై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. సెమినార్‌లో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకులు ఐ.శ్రీలక్ష్మి, డాక్టర్ ఎస్.వాణికుమారి, వి.శైలజ, ఎస్.మాధవీలత, ఎస్.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల గోడు వినేదెవరు..?

- సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్న ఆదివాసీలు
- మౌలిక వసతులకు నోచుకోని గిరిజనులు
- సరిహద్దు సమస్యలు, భూముల ఆక్రమణ సమస్యలతో సతమతం
- ప్రభుత్వానికి పట్టని గిరిజనుల వేదన

గిరిజన సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తే అంతా డొల్లతనమే కనిపిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో నేటికీ చాలా ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం లేని దుస్థితి నెలకొంది. తాగునీటి కోసం బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. గిరిజనులు పండించిన పంటలను వ్యాపారులు, దళారులు చాలా తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్న పరిస్థితులు గిరిజన గూడేల్లో కనిపిస్తున్నాయి. వారసత్వంగా గిరిజనులు సాగు చేస్తున్న భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నా, వారికి రక్షణ కల్పించే 1/70 చట్టానికి దిక్కు లేకుండా పోయింది. తమ సమస్యలను చెప్పుకునేందుకు వినే నాథుడే కరువయ్యాడు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలను అందజేసినా ఫలితం కనిపించడం లేదు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఎపి గిరిజన సంఘం ప్రజా చైతన్య యాత్రలు చేపట్టి అనేక సమస్యలను గుర్తించింది. వాటి పరిష్కారం కోసం పలురూపాల్లో పోరాటాలు సాగిస్తోంది.



గిరిజనోత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గొట్టిల్లి సచివాలయం వద్ద చీపుర్లతో నిరసన తెలుపుతున్న గిరిజనులు (ఫైల్)

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాల విభజన ఆదివాసీలకు కొత్త సమస్యను తెచ్చిపెట్టింది. ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటిడిఎ, పార్వతీపురం మన్యం జిల్లాకు తరలిపోయింది. సీతంపేట ఐటిడిఎ ఎప్పటిమాదిరిగానే తన పరిధిలోని మండలాలకు సేవలందిస్తుందని ప్రభుత్వం చెప్పినా, వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగానే ఉన్నాయి. దీంతో జిల్లాలోని ఐటిడిఎ పరిధిలో గల సబ్‌ప్లాన్ మండలాలు, గిరిజన ప్రభావిత మండలాల ఆదివాసీలను పట్టించుకునే వారే కరువయ్యారు. సీతంపేట కేంద్రంగా పనిచేస్తున్న ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాలో ఉండటంతో, జిల్లాకు చెందిన గిరిజనులు రెండింటికీ చెడ్డ రేవడిలా మారారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి పథకాల అమల్లోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు తమ సమస్యలను చెప్పుకునే వేదిక లేకుండా పోయింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో అనేక సమస్యలు ముసురుకున్నాయి.

గిరిజనుల భూములు ఆక్రమణ

తమ తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించిన సాగు చేస్తున్న భూముల్లో గిరిజనులు వరి, కంది, జీడి, మామిడి పంటలను సాగు చేస్తున్నారు. అధికారులతో కుమ్మక్కై ఇవి తమ భూములంటూ గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్న పరిస్థితి నెలకొంది. కంచిలి మండలం నొగురుదిలో 15 గ్రామాలకు చెందిన గిరిజనులు సుమారు 500 ఎకరాల్లో పలురకాల పంటలను సాగు చేస్తున్నారు. గిరిజనులకు పట్టాలు ఇవ్వడానికి ఇష్టపడని అధికారులు సోంపేట, కంచిలికి చెందిన గిరిజనేతరులు, మాజీ సైనికోద్యోగుల పేరుతో పట్టాలు జారీ చేస్తూ వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారు. మందస మండలం కొండలోగాంలో అవే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల గిరిజనుల శ్మశాన స్థలాలను సైతం ఆక్రమించుకుంటున్నారు. మందస మండలం బలియాసాయి గ్రామంలో 1984లో అప్పట్లో ఐటిడిఎ అధికారులు గిరిజనులకు శ్మశానం కోసం ఐదెకరాల భూమిని కేటాయించారు. గిరిజనేతరుడు ఒకరు అవి తన భూములే అంటూ ప్రభుత్వ అధికారులతో సర్వే చేయించి ఆక్రమించుకున్నాడు.

కనీస మౌలిక వసతులు కరువు

జిల్లాలో ఇప్పటికీ కొన్ని గిరిజన గ్రామాలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. కొత్తూరు మండలం గొట్టిల్లి, ఇరపాడు, మామిడిగూడ, కోతంగూడ తదితర గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాల్లేవు. ఇరపాడును ప్రత్యేక పంచాయతీగా గుర్తించినా కార్యాలయానికి సొంత భవనం, అంగన్వాడీ, పాఠశాల ఏర్పాటు లేదు. కొత్తూరు మండలం కోతంగూడ ముల్లమామిడిగూడకు కనీస రోడ్డు సౌకర్యమూ లేదు. మందస మండలం బుడార్సింగి పంచాయతీ పాతకోటలో బోరు సౌకర్యం లేకపోవడంతో బావి నీళ్ల మీద ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. టెక్కలిలో జక్కగొరెటిలో రోడ్డు, మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పెత్తందారుల పాలనలో గిరిజన గ్రామాలు

జిల్లాలో పలు గ్రామాల్లో అధిక శాతం గిరిజనులు ఉన్న పంచాయతీల్లో పెత్తందారుల పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం 500 మంది జనాభా ఉన్న గిరిజన గూడేలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తిస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. పెత్తందారుల రాజకీయ పలుకుబడితో గిరిజన గూడేలు తమ పంచాయతీ నుంచి విడిపోకుండా అడ్డుకుంటున్న పరిస్థితి పలుచోట్ల నెలకొంది. మందస మండలం బుడార్సింగి పంచాయతీలో 19 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 11 గ్రామాల్లో పూర్తిగా, మరో రెండు గ్రామాల్లో పాక్షికంగా ఎస్‌టి జనాభా ఉంది.

ఎస్‌టి ప్రాంతాలకు కేటాయించిన నిధులను తమ గ్రామాలకు కేటాయించకపోవడంతో అభివృద్ధి జరగడం లేదని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆవేదన వారిలో నెలకొంది. పాతకోట కేంద్రంగా పంచాయతీని ఏర్పాటు చేయాలని చాలాకాలంగా గిరిజనులు కోరుతున్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు, ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడం, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం ద్వారానే తమ సమస్యలు పరిష్కారమవుతాయని వారు నమ్ముతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో గిరిజనులు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది. గత నెల 26వ తేదీన చలో కలెక్టరేట్ చేపట్టగా, ఈనెల ఏడో తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టాలని గిరిజనులు నిర్ణయించారు.

జిజిహెచ్‌లో మెరుగైన వైద్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల రోగులకు అందుతున్న సేవల్లో లోపాలను పలువురు నేరుగా ఆయన దృష్టికి తీసుకురావడంతో ఈ తనిఖీ చేపట్టారు. అవుట్ పేషెంట్ల విభాగాన్ని సందర్శించిన ఆయన అక్కడ అందిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అర్థోపెడిక్ విభాగంలో వృద్ధులు వేచి ఉండే పరిస్థితి లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిపై చిన్న చిన్న సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. మందుల కొరత పేరుతో రోగులతో మందులు కొనుగోలు చేయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అవసరమైన మందులను ఆస్పత్రి ద్వారా కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆస్పత్రిలో ఉద్యోగ నియామకాలు అవసరమున్న మేరకు పూర్తి చేశామని, ఎక్కడైనా అదనంగా అవసరం ఉందని భావిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అర్థోపెడిక్ విభాగంలోని రోగులతో కలెక్టర్ మాట్లాడారు. మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులను పరిశీలించి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రన్నింగ్ వాటర్‌ను పరిశీలించారు. మార్చురీ ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలని ఇఇని ఆదేశించారు. వికలాంగులకు ధ్రువీకరణ పత్రాల జారీలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం కేంద్రాన్ని సందర్శించి సర్టిఫికెట్లు పరిశీలించారు. కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతాల చెల్లింపులో కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరును పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీల, ఆర్ఎంఒలు డాక్టర్ అనిత, సుభాషిణి, సి.పి శ్రీదేవి, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటచలం, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి – కొత్తూరు

రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించనున్నట్లు టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి అన్నారు. కొత్తూరులో సర్పంచ్ పడాల కృష్ణవేని అధ్యక్షతన రీ సర్వే గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఒకరి భూమి ఇంకొకరి పేరున తప్పుగా రికార్డుల్లో నమోదు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, రైతులు సహకరించాలని కోరారు. కర్లెమ్మలో సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుతామన్నారు. కర్లెమ్మ సర్వేయర్, విఆర్‌ఒ, ఆర్.ఎస్ డిటిపై విచారణ కమిటీ వేశామని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని రోజుకు 20 ఎకరాలు మాత్రమే సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, డిటిలు సిహెచ్.భీమారావు, గురవయ్య, సర్వేయర్ ఎ.తిరుపతిరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి



నిరసన తెలుపుతున్న అదానీ స్మార్ట్‌మీటర్ల టెక్నీషియన్లు

అదానీ స్మార్ట్‌మీటర్ టెక్నీషియన్ల ఆందోళన

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

సంవత్సరం పాటు పని కల్పించడంతో పాటు నెలకు రూ.30 వేలు వేతనాలు చెల్లిస్తామని కాంట్రాక్టు ఇచ్చి ఇప్పుడు మోసం చేశారని అదానీ స్మార్ట్‌మీటర్ల టెక్నీషియన్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని పిఎన్ కాలనీలో గల అదానీ స్మార్ట్‌మీటర్ల కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. స్మార్ట్ మీటర్స్ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్లుగా నియామకాలు చేపట్టారని, విధులోకి చేరిన తర్వాత జిల్లాలో 90శాతం మీటర్లు బిగించడం పూర్తి చేశామని చెప్పారు. ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి మూడు నెలల పాటు రూ.30 వేలు చొప్పున వేతనాలు చెల్లించి, ఈనెల నుంచి రూ.12వేలు ఇస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఎనిమిది కేటగిరీలుగా విభజించారని, ఈ కేటగిరీల వారిగా ఇప్పటికే పనులు పూర్తి కావడంతో ఒప్పందం ప్రకారం మరో తొమ్మిది నెలలు గడువు ఉండగానే తొలగించడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మీటర్లు బిగించే సమయంలో ఎటువంటి భద్రతా సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఐటి రంగ అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి – ఆమదాలవలస

రాష్ట్రంలో ఐటి రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికలేనని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. డల్లాస్‌లోని గూగుల్ ఆహ్వానం మేరకు ఆ సంస్థ కార్యాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో క్రియాశీలకంగా, వేగంగా దూసుకుపోతున్న ఎ వన్ టెక్నాలజీ విశిష్టతపై గూగుల్ కంపెనీ సీనియర్ డైరెక్టర్‌తో విశ్లేషించినట్లు చెప్పారు. ఎ వన్ టెక్నాలజీని ఉపయోగించుకుని రాష్ట్రాన్ని విద్య, వైద్య, ఐటి తదితర రంగాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఇంజినీరింగ్ ఐటి ఎ వన్ రంగాల కోసం గూగుల్ కంపెనీకి చెందిన పలువురు నిపుణులతో చర్చించానన్నారు. తెలుగు వారు సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యంత కీలకమైన పదవుల్లో ఉండడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఐటి రంగాన్ని పూర్తిగా నాశనం చేసిందని ఆరోపించారు. టిడిపి కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటి రంగానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించారని, పలు రాయితీలూ ప్రకటించారని ఎన్ఆర్ఐలకు వివరించినట్లు తెలిపారు. విశాఖపట్నం ఐటి రంగానికి ఎంతో అనుకూలమైన ప్రాంతంగా ఉందని, విశాఖలో ప్రస్తుతం కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయంటే అది సిఎం చంద్రబాబు నాయుడు, ఐటి మంత్రి లోకేష్ కృషి ఫలితమేనన్నారు. భవిష్యత్‌లో వీలైనన్ని ఎక్కువ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించి, తెలుగు రాష్ట్రాల యువతకు ఉపాధి కల్పించాలని ఎన్ఆర్ఐలను కోరినట్లు తెలిపారు.



గూగుల్ సిబ్బందితో చర్చిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో రాజ్యాంగ విఘాతం

జామియా మసీదు వద్ద కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును టిడిపి, జనసేన వంటి మిత్రపక్షాల సహకారంతో బిజెపి ఆమోదింపజేసుకుందని సిపిఎం నాయకులు కె.శ్రీనివాసు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని జామియా మసీదు, చంప ఫిరౌసీ మసీదుల వద్ద వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విఘాతం కలిగించేదిగా ఉందన్నారు. ముస్లిం మైనార్టీలే లక్ష్యంగా బిజెపి విభజన రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ పరిణామంపై ముస్లిం మైనార్టీల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. సాధారణ ముస్లిముల్లో కేంద్ర ప్రభుత్వ చర్యలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. సిపిఎం ప్రతినిధుల వద్ద ముస్లిం ప్రతినిధులు వక్ఫ్ చట్ట సవరణపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.సుధాకరరావు, ఆర్.ప్రకాశరావు, పి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.



మంత్రిని కలిసి సన్మానిస్తున్న డిపిఎం సత్యనారాయణ

ప్రకృతి వ్యవసాయ డిపిఎంగా సత్యనారాయణ

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్, కోటబొమ్మాళి

జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్‌గా పూజారి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని నిరోధానికి రైతులు సహకరించాలన్నారు. జిల్లాలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి సూచించారు.

గ్రంథాలయం పర్సన్ ఇన్‌ఛార్జిగా జెసి

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో పర్సన్ ఇన్‌ఛార్జిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు, ఉప గ్రంథాలయాధికారి వి.వి.జి.ఎస్ శంకరరావు పాల్గొన్నారు.

టెక్కలిని మున్సిపాల్టీ చేస్తాం

- అప్పుడే అభివృద్ధి సాధ్యం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి – టెక్కలి రూరల్, నౌపడ

పంచాయతీగా కొనసాగితే టెక్కలి రూపురేఖలు మారవని, జిల్లా కేంద్రానికి ధీటుగా అభివృద్ధి చెందడానికి మున్సిపాల్టీగా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి వరకు రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు, టెక్కలి నుంచి చెట్లతాండ్ర వరకు రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు, టెక్కలి అంబేద్కర్ జంక్షన్ తొలుసూరుపల్లి రోడ్డు దగ్గర భగవాన్ పురం–చెట్లతాండ్ర రోడ్డు, భగవాన్ పురం, ఆరికివలస మీదుగా చెట్లతాండ్ర గ్రామం వద్ద, కోటబొమ్మాళి చెరువు వద్ద కోటబొమ్మాళి–సంతబొమ్మాళి రోడ్డులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలతో మాట్లాడి అందరి సహకారంతో దశలవారీగా మున్సిపాల్టీని చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. టెక్కలిలో డిగ్రీ కళాశాలకు రూ.రెండు కోట్లతో ప్రహరీ ఏర్పాటు చేస్తామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. పాఠశాలల పున:ప్రారంభం నాటికి ఉపాధ్యాయుల పోస్టులు భర్తీని పూర్తి చేస్తామన్నారు. తల్లికి వందనం పేరుతో చదువుకున్న పిల్లలు ఎందరు ఉంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతు పెట్టుబడి సాయం రూ.20 వేలు త్వరలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడతల వారీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. టెక్కలిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని తిరిగి తీసుకొని పేద ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్యాక్రాంతమైన దేవాదాయ భూముల్లో కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని, నియోజకవర్గంలో రూ.420 కోట్లతో తాగునీటి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నూతన పింఛన్లకు కమిటీ ఏర్పాటు చేశామని, త్వరలో అర్హులందరికీ అందించనున్నట్లు చెప్పారు. పల్లెలను రెండేళ్లలో సమగ్రంగా అభివృద్ధి చేసి, స్వర్ణ గ్రామాలు'గా తీర్చిదిద్దుతామన్నారు. మరో పది రోజుల్లో రూ.120 కోట్లతో డిపిఎస్ రోడ్డు, నౌపడ– వెంకటాపురం రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పట్టుమహదేవు కోనేరు ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా, చెట్లతాండ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణమూర్తి, ఆర్ అండ్ బి ఎస్ఇ కె.జాన్ సుధాకర్, డిఇఇ రవికాంత్, ఎఇఇ జగదీష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, టిడిపి నాయకులు బగాది శేషగిరిరావు, పి.అజయ్ కుమార్, ఎల్.ఎల్ నాయుడు, చాపర గణపతిరావు, హనుమంతు రామకృష్ణ, జీరు బీమారావు, పంగ ఆశిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

లేఖ రచన పోటీల్లో కావ్యశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి – ఆమదాలవలస

తపాలా శాఖ జాతీయస్థాయిలో నిర్వహించిన లేఖ రచన పోటీల్లో సరుబుజ్జిలి మండల కేంద్రానికి చెందిన ఇ.కావ్యశ్రీ రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. కావ్యశ్రీ మండలంలోని శ్రీవాణి విద్యానికేతన్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. పాఠశాల ప్రాంగణంలో కావ్యశ్రీకి శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ వండాన హరిబాబు రూ.25 వేల చెక్కును శుక్రవారం అందజేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన లేఖ రచన పోటీల్లో సుమారు ఎనిమిది వేల మంది పాల్గొనగా, జిల్లాకు చెందిన విద్యార్థిని నగదు బహుమతిని కైవసం చేసుకోవడం పోస్టల్ శాఖకు, జిల్లాకు దక్కిన గౌరవమని హరిబాబు అన్నారు. కావ్యశ్రీ, ఆమె తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కావ్యశ్రీని, లేఖ రచన పోటీల్లో ఆమెకు తర్ఫీదును ఇచ్చిన పాఠశాలకు చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కె.వి రాజారావును శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల డైరెక్టర్ బలివాడ వెంకటేశ్వర్లు, బలివాడ నారాయణమూర్తి, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఎస్.వి రమణ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంపత్, ప్రణవి, తరుణ్, హరిబాబు, పోస్టల్ శాఖ ప్రతినిధి పూజారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

మహిళలు రాజకీయాల్లోకి రావాలి

ప్రజాశక్తి- పలాస


మాట్లాడుతున్న శిరీష

అన్ని రంగాల్లో ప్రస్తుతం మహిళలు దూసుకుపోతున్నారని, రాజకీయ రంగంలో కూడా మహిళలు చక్కనైన పాత్ర పోషిస్తున్నారని, భవిష్యత్‌లో ఈ రంగంలోకి అధిక సంఖ్యలో మహిళలు రావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకాంక్షించారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలోని సెంచూరియన్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ 2024-25కు ముఖ్య అతిధిగా పలాస ఎమ్మెల్యే శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి, వాటిని పరిష్కరించాలనే తపన ఉన్న మహిళలు తప్పనిరిగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాలన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, తాను రాజకీయ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు తన కుటుంబం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. అంతకుముందు విద్యార్థినులంతా ఆమెకు పూలతో ఘన స్వాగతం పలికి చిరు సత్కారం చేశారు.

సమస్యల పరిష్కారానికే 'మన ఊరికి మన ఎమ్మెల్యే'

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కోష్ట పంచాయతీలో 'మన ఊరుకి మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం పంచాయతీలో పల్లిపేట, దువ్వానపేట, పైడిపేట, కోష్ట గ్రామాల్లో పర్యటించారు. అనంతరం కోష్టలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలోని చాలా సమస్యలను ప్రస్తావించినట్టు చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి పిసిణి లక్ష్మి జగన్నాధం నాయుడు, ఎంపిటిసి సత్యవతి అసిరినాయుడు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, లెంక శ్యాం, పైడి అప్పడుదొర, పిసిని హరికృష్ణ, శ్రీనివాసరావు, గొర్లె సాయి, రెడ్డి కోటేశ్వరరావు, ఎం.నాగేశ్వరావు, తహశీల్దార్ ఎన్. ప్రసాదరావు, లంక ప్రభ, ఎంపిటిసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సతీష్‌కుమార్

సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు కళాత్మకంగా వ్యవహరించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలని ప్రముఖ మానసిక వైద్యుడు, అంతర్జాతీయ మోటివేషన్ స్పీకర్, అంతర్ముఖి సిఇఒ మాకేన సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయి వినీత్ విద్యా సంస్థల ఆవరణలో విద్యార్థుల తల్లితండ్రుల కోసం నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ పరెంటింగ్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధా యుగంలో పిల్లలను పెంచడం తల్లి దండ్రులకు పెద్ద సవాలుగా మారిందన్నారు. సెల్‌ఫోన్‌కు బానిసలవుతున్న విద్యార్థులు చదువుకు దూరమై మానసిక రుగ్మతలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతి చిన్న విషయానికి చిరాకు, అసహనం, నిద్రలేమి కారణంగా ఒత్తిడికి గురవుతున్నారని, వీటన్నిటి నుంచి పిల్లలను కాపాడాలంటే తల్లిదండ్రుల ప్రవర్తనలో మార్పులు రావాలని సూచించారు. తల్లిదండ్రులు కుటుంబ వ్యవస్థ పనితీరు, మానవ సంబంధాలు, నైతిక విలువలపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సాయి వినీత్ విద్యా సంస్థలు స్థాపకులు డాక్టర్ చపర కోదండరావు, విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ లీలా, ప్రిన్సిపాల్ అన్నేపు కైలాశరావు, బత్తిని శ్రీను, బచ్చులి ధర్మారావు, సాయి, షణ్ముఖరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి ఈ నెల 6న నిర్వహించనున్న పరీక్ష 13వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన ప్రకటనలో పేర్కొన్నారు. 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసు కోవాలన్నారు.

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండలంలోని దుప్పలవలస అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 6న జరగాల్సిన పరీక్ష వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

బూర్జ: మండలంలోని కొల్లివలస అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 5వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు ఈ నెల 13న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.దేవేందరరావు ఒక ప్రకటనలో తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

మెరుగైన వైద్యం అందించాలి

మందస: మండలం హరిపురం సిహెచ్‌సిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆస్పత్రికి కావాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించి ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, కమిటీసభ్యులు జోగారావు, తులసి, సాలీనా భీమారావు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఆజాద్‌ను అభినందించిన షర్మిల

ప్రజాశక్తి- టెక్కలి



అధికార ప్రతినిధుల నియామకార్థం.. ఇండియన్ యూత్ కాంగ్రెస్ నేతృత్వంలో పాట్నాలో నిర్వహించిన యంగ్ ఇండియా కేబోల్ జాతీయస్థాయి ఉపన్యాస పోటీల్లో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జిల్లా వాసి పేడాడ చంద్రశేఖర్ అజాద్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు ఢిల్లీలో అందించనున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేయడంలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు షర్మిల, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయభాను చిబ్, ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, ఐవైసి జాయింట్ సెక్రటరీ మమతా నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావుకు అజాద్ కృతజ్ఞతలు తెలిపారు.

సర్వజనాస్పత్రిలో బాలింతల అవస్థలు

ప్రజాశక్తి- గుజరాతీపేట

జిల్లాలోని రిమ్స్ ఆస్పత్రికి జిల్లా నలుమూలల నుంచి వైద్యం కోసం నిత్యం వందలాది మంది వస్తూ ఉంటారు. అలాంటి ఆస్పత్రిలో రోగుల పరిస్థితి అధ్వానంగా మారింది. గతనెల రోజుల నుంచి ఎమర్జెన్సీ వార్డుల్లో ఎసిలు పనిచేయకపోయినా అధికారులు పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్యంకోసం రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే వెంట టేబుల్ ఫ్యాన్ తీసుకువెళ్లాల్సిందే. సరైన వసతులు లేకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇది శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి దుస్థితి. భానుడి ప్రతాపంతో అల్లాడిపోతున్న జనాలు, యువకులు కూడా మండు వేసవిలో వేడికి తట్టుకోలేక డిహైడ్రేషన్‌కు గురవుతున్న పరిస్థితి ఉంది. అయితే గైనకాలజీలో ఆపరేషన్ తరువాత రూముల్లో ఉక్కపోతకు తట్టుకోలేక బాలింతలకు నానా అవస్థలు పడుతున్నారు. వార్డుల్లో ఉన్న ఎసిలు పనిచేయడం లేదని, ఎసిలు మరమ్మతులు కూడా చేయించడం లేదని, కనీసం ఫ్యాన్లు కూడా అందుబాటులో లేవని రోగులు వాపోతున్నారు. సిబ్బందిని అడిగితే ఇంటి దగ్గర నుండి ఫ్యాన్లు తెచ్చుకోండని బదులిస్తున్నారని, తప్పని పరిస్థితుల్లో ఇంటి వద్ద నుంచి టేబుల్ ఫ్యాన్లను తెచ్చుకుని ఏర్పాటు చేసుకుంటున్నామని రోగులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రసూత విభాగంలో నిధుల కొరత వలన నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ప్రజాశక్తి విలేఖరి సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీలా వద్ద ప్రస్తావించగా ఆస్పత్రిలో ఎసిలు పనిచేయడం లేదని ఉన్నతాధికారులకు వెల్లడించామని, ప్రస్తుతానికి ఎసిలు పనిచేయని వార్డుల్లో గోడఫ్యాన్లను అమర్చుతున్నామన్నారు. ఫ్యాన్లు పాడవడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో వాల్ మౌంటెడ్ ఫ్యాన్లను పెడుతున్నామని, ఆస్పత్రిలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.


ఎసిలు పనిచేయకపోవడంతో రోగులు తెచ్చుకున్న ఫ్యాన్లు


సమీక్ష నిర్వహిస్తున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

డిఆర్‌డిఎ పీడీ సందర్శన

ప్రజాశక్తి- నందిగాం

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని డిఆర్‌డిఎ పీడీ బి.కిరణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ప్రాజెక్టు పరిధిలో నిర్వహిస్తున్న ప్రధాన అంశాలపై సమీక్షించారు. స్వయంశక్తి సహాయక సంఘాల క్రెడిట్ ప్లాన్, ఆదాయం, ప్రొఫైల్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ మల్లేశ్వరరావు, ఎపిఎం మనోరత్నం, సిసిలు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాల్లో సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి- కొత్తూరు

ఇటీవల జరుగుతున్న చోరీలను అరికట్టేందుకు స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కొత్తూరు, హిరమండలం మండలాల్లోని ఆలయాలు, చర్చిల్లో 20 సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సిసి కెమెరాలు కొనుగోలు చేసినట్లు సిఐ చింతాడ ప్రసాదరావు తెలిపారు. అలాగే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి సమయంలో 11 గంటల తర్వాత తిరగరాదని, అత్యవసరమైతే బయటకు రావాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ ఉన్నారు.

రేషన్ సరఫరాపై ఆరా

ప్రజాశక్తి- కవిటి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న రాజేష్

జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ పౌర సరఫరాల పంపిణీ విధానంపై ఆరా తీశారు. శుక్రవారం రేషన్ పంపిణీ పరిశీలించి లబ్ధి దారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు లబ్ధిదారులు మాట్లాడుతూ కేవలం బియ్యం, పంచదార పంపిణీకి మాత్రమే రేషన్ పరిమిత మవుతున్నట్టు తెలిపారు. లబ్ధిదారుల శ్రేయస్సు దృష్ట్యా కందిపప్పు, కొమ్ము శెనగలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అవకతవకలు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని సూచించారు. అలాగే వినియోగదారుల విన్నపాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలిపారు.

రేపు ఉత్కళాంధ్ర కవి సమ్మేళనం

పలాస: శ్రీరామనవమి సందర్భంగా జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో పలాస లైన్స్ క్లబ్ హాల్ చిన్న ఉదయపురంలో 6వ తేదీ ఆదివారం ఉత్కలాంధ్ర (ఆంధ్ర- ఒడిశా రెండు రాష్ట్రాల) ఆహ్వానిత కవి సమ్మేళనం నిర్వహిస్తామని జన జాగృతి అధ్యక్షులు కుమార్ నాయక్, వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి, కార్యదర్శి బి.కాళిదాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవితా పఠనంలో పాల్గొన్న కవులను సత్కరిస్తామని, కవి సమ్మేళన అనంతరం కవన భోజనం ఏర్పాటు చేశామని, ప్రవేశ రుసుం లేదన్నారు. ఆహ్వానిత కవులు హాజరై జయప్రదం చేయాలని కుమార్ నాయక్ కోరారు.

సమన్వయంతో పనిచేద్దాం

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

పార్టీలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే తారతమ్యం లేకుండా అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేద్దామని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని పట్టుశాలి కళ్యాణమండపంలో శుక్రవారం వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి అధ్యక్షతన వైసిపి మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కూన రవికుమార్ ఎన్నికల్లో ఓటు వేయలేదనే ఒకే ఒక కారణంతో ఉద్యోగాలు తొలగించడం, వ్యాపారాలు మూయించడం, కేసులు పెట్టడం వంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే అక్రమ ఇసుక రవాణాతో రోజుకు సుమారు రూ.కోటి సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమావేశాలకు వెళ్లరాదంటూ పలువురు ఫోన్లు చేసినప్పటికీ వాటిని పట్టించుకోకుండా అందరూ ఐకమత్యం చాటుతూ సమావేశానికి హాజరు అయ్యారన్నారు. అధికారం లేకపోయినా, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ విజయం కోసం శ్రమిద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు లోలుగు కాంతారావు, సురవరపు నాగేశ్వరరావు, బూర్జ, సరుబుజ్జిలి వైసిపి మండల అధ్యక్షులు కండాపు గోవిందరావు, బి.మల్లేశ్వరరావు, మున్సిపాలిటీ ఫ్లోర్‌లీడర్ బి.అజంత, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు సురేష్, ట్రేడ్‌యూనియన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షులు బి.పద్మజ, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ సత్యప్రసాద్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, నాయకులు గుడ్ల మోహన్, గోవిందరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి


నరసన్నపేట : పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వం సంపూర్ణమైన విద్యను అందించే దిశగా అన్ని విధాల కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన భవిష్యత్‌ను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, వూన్న పెద్దబాబు, జామి వెంకటరావు, బోయిన ఆనంద్, బతకల సంతోషి, పుచ్చల కల్పన, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీ వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ బండారు రవి కుమార్, ఎస్.సూర్యకుమారి, అధ్యాపకులు, టిడిపి నాయకులు అగడముడి అరుణ్ కుమార్, మాతల గాంధీ, లోతుగెడ్డ తాతబాబు, సంజీవరావు, అర్.కన్నయ్య, పి.వెంకట కృష్ణలు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆగతముడి మాధవరావు ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున అందజేస్తానని ప్రకటించారు.

అరసవల్లి సందర్శన


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎగ్జిక్యూటివ్ అధికారి బెహారా జైకుమార్ సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ ఇఒ వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుగంధర్

మహాసభలు విజయవంతం చేయాలి

శ్రీకాకుళం అర్బన్: ఆలిండియా యూత్ ఫెడరేషన్ 17వ జాతీయ మహాసభలు ఈ ఏడాది మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరగనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని సిపిఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని, సభలను విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, అరవింద్, వాసు, క్రాంతి, హరి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పిఒ నాగరాణి

బాల్య వివాహ నిరోధక కమిటీ ఏర్పాటు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, కవిటి మండలాలు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం సమావేశం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి ఆధ్వర్యంలో కేంద్రాల వారి సమావేశాలు ఏర్పాటు చేశారు. బాల్య వివాహ నిరోధక కమిటీ, బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి నెలలో మూడు సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు, చైల్డ్ రైట్స్, హెల్ప్ లైన్ ఆవశ్యకత, స్కూల్‌లో కంప్లైంట్ బాక్స్, వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో చట్టంపై వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతి నిధులు, సచివాలయం సిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు (సి) పంచాయతీ జలక లింగపురానికి చెందిన పోలాకి రంగారావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని శుక్రవారం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, మండల వైసిపి కన్వీనర్ పోలాకి జయము నిరావ్ పాల్గొన్నారు

జిరాయతీ భూముల్లో రహదారి నిర్మించారు!

అడిగితే దాడికి ప్రయత్నిస్తున్నారని బాధితుల అవేదన


తమ భూముల్లో రోడ్డు వేశారని చూపుతున్న బాధితులు

కోటబొమ్మాళి: మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ సింహాద్రిపురం గ్రామానికి చెందిన పలు పేద కుటుంబాలాకు చెందిన జిరాయితీ భూముల్లో శ్మశానానికి రహదారి అని చెప్పి గ్రామానికి చెందిన పలువురు అధికార పార్టీ నాయకులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దౌర్జనంగా రహదారి నిర్మించారని, దీనిపై వారిని ప్రశ్నిస్తే తమపైకి దాడి చేయడానికి వచ్చారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. సింహాద్రిపురానికి చెందిన కూన ఇనుములు, కూన రాజశేఖర్, కూన నారాయణరావు, కూన రవి, కూన రామ్మూర్తి, కృష్ణారావు, విజయలక్ష్మి, వానయ్య, పరమేశ్వరరావు, మోహనరావు, చింతాడ మహేష్‌లు శుక్రవారం విలేకర్లుతో మాట్లాడుతూ తమకు చెందిన సుమారు మూడెకరాల జిరాయితీ భూముల్లో గ్రామానికి చెందిన అధికార పార్టీ కార్యకర్తలు ముద్ద ఢిల్లేశ్వరరావు, బర్ల రవి, బర్ల సుందరరావు, బర్ల రామన్న, బర్ల గోపి, రాజాపు యర్రన్న, అంబటి మెహన్, అంబటి ఆనందర్ తదితరులు శ్మశానానికి రోడ్డు వేశారని, మా భూముల్లో ఎందుకు రోడ్డు వేశారని గ్రామ పెద్దలతో కలిసి అడిగితే శ్మశానవాటికకు రోడ్డు వేస్తున్నామని అడ్డు చెబితే ఊరుకునేది లేదంటూ వారు హెచ్చరించారని బాధితులు తెలిపారు. ఒకవేళ శ్మశానానికి రోడ్డు వేయటానికి స్థలం కావాలంటే తమ భూములకు గ్రామంలో ఉన్న ధర ప్రకారం చెల్లించి రోడ్డు వేసుకోవాలని కాని అలా కాకుండా ఉన్న కొద్ది భూముల్లో దౌర్జనంగా రోడ్డు వేయటం సరికాదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

భర్తే హంతకుడు

కరాపాడు హత్య కేసులో వీడిన మిస్టరీ

ప్రజాశక్తి- కవిటి

సంచలనం సృష్టించిన కవిటి మండలం ఆర్ కరాపాడు హత్య కేసులో మిస్టరీ వీడింది. అందరూ అనుమానించినట్టుగా భర్త దిలీప్‌తో పాటు హత్యకు సహకరించిన వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో డిఎస్‌పి వి.వెంకట అప్పారావు వెల్లడించారు. డిఎస్‌పి అందించిన సమాచారం మేరకు ఆర్ కరాపాడు గ్రామానికి చెందిన కొంతాల దిలీప్ కుమార్ అదే గ్రామానికి చెందిన రౌతురెడ్ల మీనాక్షి అలియాస్ మీనాను నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. అయితే గత రెండేళ్లుగా మీనాక్షిపై అనుమానం పెంచుకున్న దిలీప్ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించడమే కాకుండా ప్రస్తుతం మీనాక్షి ఐదు నెలల గర్భంపై కూడా అనుమానం వ్యక్తం చేస్తూ వేధింపులు అధికం చేశాడు. అంతేకాకుండా చంపేస్తానని కూడా ఇటీవల పలుమార్లు బెదిరించాడు. అందులో భాగంగానే ఒడిశా రాష్ట్రం కేసరిపడ గ్రామానికి చెందిన మెట్టూరు రవి, విశాఖపట్నంకు చెందిన వనము దాసు, జాడుపుడి ఆర్.ఎస్‌కు చెందిన తోట భాను ప్రసాద్ సాయం తీసుకున్నాడు. పథకం ప్రకారం మార్చి 28వ తేదీ రాత్రి దిలీప్ భార్య మీనాక్షితో సోంపేట నుంచి వస్తుండగా ఆర్ కరాపాడు రైల్వేట్రాక్ దాటగానే భాను ప్రసాద్‌తో దాడి చేయించి ఇనుపరాడ్డుతో ఆమె తలపై కొట్టి హత్య చేయించారు. మీనాక్షి తల్లి రౌతురెడ్ల రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం సిఐ ఎం.చిన్నంనాయుడు ఇచ్ఛాపురం ధనరాజు తులసమ్మ కోవెల వద్ద నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్డు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక బంగారు గొలుసు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ చిన్నం నాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి


సునీల్ (ఫైల్)


పొందూరు: మండలం లోలుగు గ్రామానికి చెందిన గార సునీల్ (28) గుండెపోటుతో గురువారం సాయంత్రం మృతి చెందాడు. యువకుడు పైడిభీమవరంలోని ప్రవేట్ కంపెనీలో పనిచేస్తుండగా, ఉదయాన్నే డ్యూటీకి వెళ్లాడు. కంపెనీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఒక్కసారిగా కుర్చీలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న యాజమాన్యం, తోటి సిబ్బంది హుటాహుటిన చికిత్స కొరకు విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. దీంతో శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. మృతుని తండ్రి గార అప్పారావు మండలంలోని తాడివలస పిహెచ్‌సిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి చిట్టితల్లి గృహిణి. మృతుడు అంత్యక్రియలకు మండలంలోని వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, కంపెనీలోని సహచర ఉద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో ముగ్గురు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి 2.140 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ముందు గంజాయితో పట్టుబడిన ముగ్గురు నిందితులు లక్ష్మీ కాంత్ బలయార్ సింగ్, మోహన్ దాస్ ప్రదాన్, వీరిద్దరూ ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన వారు కాగా, మరొకరు మహారాష్ట్రకు చెందిన సాహిజీ రామ్ జాదవాను అరెస్టు చేసి 2.140 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లను ఇచ్ఛాపురం టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన లక్ష్మి కాంత్ బలియార్ సింగ్, ఆయన బావ అయిన మోహన్ దాస్ ప్రదాన్ వారి ఆర్థిక పరిస్థితి బాగులేని కారణంగా గంజాయి వ్యాపారం చేద్దామని నిర్ణయించుకొని, వారి గ్రామానికి దగ్గరలో గల కొండ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద తక్కువ రేటుకు గంజాయిని కొని, దానిని లక్ష్మీకాంత్ బలియార్ సింగ్ మహారాష్ట్ర తీసుకువెళ్లి ఔరంగాబాదు ప్రాంతంలో తెలియని వ్యక్తులకు ఎక్కువ రేటుకు అమ్మి, దాని ద్వారా వచ్చిన అక్రమ లాభార్జనను, ఇద్దరు సమానంగా పంచుకుంటున్నట్లు తెలిపారు. సుమారు ఏడు నెలల క్రితం సికింద్రాబాద్‌లో లక్ష్మి కాంత్ బలియార్ సింగ్‌కు పరిచయమైన మహారాష్ట్ర, ఒస్మానబాద్‌కు చెందిన గంజాయి వ్యాపారం చేసే షాహజీ రామ జాదవాతో పరిచయం ఏర్పడగా షాహజీ రామ జాదవా చెప్పినట్లుగా గంజాయి కొని ఆయనకు ఇస్తే, కేజీ గంజాయికి రూ.7500 లు ఇస్తాననగా, అందుకు లక్ష్మి కాంత్ బలియార్ సింగ్ అంగీకరించి, సుమారు పలుమార్లు గంజాయిని కొని, దానిని షాహజీ రామ జాదవాకు బరంపురం, ఇచ్ఛాపురంలో అమ్మినట్లు తెలిపారు. గత నెల 22న షాహజీ రామ జాదవా, లక్ష్మి కాంత్ బలియార్ సింగ్‌కి ఫోన్ చేసి, తనకు 2 కేజీల గంజాయి కావాలనగా, లక్ష్మి కాంత్ బలియార్ సింగ్, ఆయన బావ కలిసి రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేసి దానిని ఈ నెల 4న ఇచ్ఛాపురం తీసుకువచ్చి షాహజీ రామ జాదవాకి అప్పగిస్తుండగా పట్టణ పోలీసులకు పట్టుబడ్డారని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు ఉన్నారు.

క్రైమ్ కార్నర్


నాటుసారాతో నిందితుడు

నాటుసారా స్వాధీనం

కవిటి: ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిపిన దాడుల్లో 18 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ టీమ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. సిఐ రమణ అందించిన సమాచారం మేరకు మండలం యలమంచిపుట్టుగకు చెందిన సూరయ్యను 8 లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసి సూరయ్యకు నాటుసారా సరఫరా చేసిన కంచిలి మండలం కాకర్లపుట్టుగకు చెందిన కాకర్ల సోమేష్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అదే విధంగా సోంపేట మండలం జిడి పుట్టుగకు చెందిన లోకనాథంను 10 లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసి, లోకనాథంకు సారా సరఫరా చేసిన శారదాపురం గ్రామానికి చెందిన పిన్నింటి చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుజాత, మొబైల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.


అగ్నికి ఆహుతవుతున్న తోట

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదం

ఆమదాలవలస: మండలంలోని లొద్దలపేటలో పూజారి శ్రీలత అనే రైతు తోటకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. తోటలో 200 శ్రీ గంధం చెట్లు, 2 సర్వే, కొన్ని మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయని ఆమె శుక్రవారం తెలిపారు. వీటి విలువ సుమారు పది లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మంచి పెరుగుదల ఉన్న దశలో మొక్కలు కాలిపోవడాన్ని రైతు జీర్ణించుకోలేకపోతున్నారు. భర్త ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారని, వృత్తి రీత్యా ఆమదాలవలసలో నివాసం ఉంటున్నామని ఊరులో లేకపోవడాన్ని చూసి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశామని తమకు న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు.

మండలంలోని చేపేనపేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు బుడితి సాంబమూర్తి బెల్లం తయారు చేసే షెడ్ పూర్తిగా దగ్ధమైంది. పొలంలో వ్యర్థాలను కాల్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రైతు షెడ్డుతో పాటుగా అందులో ఉన్న బెల్లం తయారీ ఐరన్ పెనాలు, కొంత వరకు కషరా ఇంజన్ కూడా కాలిపోయిందని తెలిపారు. ఈ ప్రమాదం వలన రైతుకు సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని పలువురు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయగా వారు సకాలంలో సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేసి కొంతమేర నష్ట నివారణ చర్యలు చేపట్టారని గ్రామస్తులు తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు

పాఠశాలకు పూర్వ వైభవం తెస్తాం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్ద లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకప్పుడు 250 మంది విద్యార్థులతో కలకలలాడేదని వేరువేరు కారణాలతో ఇప్పుడు కేవలం 170 మందికి పడిపోయిందని, ప్రజలకు అవగాహన కల్పించి ఈ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొద్దామని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి అన్నారు. విద్యార్థులను మళ్లీ పునరుద్ధరించడానికి అక్కడ ఉపాధ్యాయులు, విద్యాకమిటీ గ్రామాల్లో అవగాహన నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ బడి గొప్ప తనాన్ని వివరిస్తున్నారు. పలు గ్రామాల్లో తిరుగుతూ పెద్ద లక్ష్మీపురంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం ఉందని, వసతిగృహంలో భోజనం చేసుకుని ఉంటూ పాఠశాలలో చదువుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లల నమోదు కోసం పాటుపడుతున్న ప్రతిఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ ఎం.ఆనందరావు, శ్రీహరి, ఎన్.వి.ఎల్.నరసింహ, మోహన్ దాస్, కృష్ణారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిపిఎం సత్యనారాయణ

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- పొందూరు

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగుచేయడం వలన రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చునని డిపిఎం పూజారి సత్యనారాయణ అన్నారు. మండలం రాపాకలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రైతులతో మమేకం కావడం ద్వారా విజయవంతం చేయాలని ఐసిఆర్‌పి సిబ్బందికి సూచించారు. నవధాన్యాల సాగుతో పాటు ఖరీఫ్ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎడిషనల్ డిపిఎం దనుంజయ్, ఐసిటిఎస్‌ఎఫ్‌ఎ శివకృష్ణ, మాస్టర్ ట్రైనర్ కె.కృష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమ కుమార్

శిక్షణలతో స్వయం ఉపాధి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువతకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకుని వృద్ధిలోకి రావాలని రెస్టీ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమకుమార్ సూచించారు. మండలం ఎస్‌ఎస్‌వలసలో నైర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. స్వయం ఉపాధి ద్వారా ఎన్నో అద్భుతాలు సృష్టించ వచ్చన్నారు. వాటి కోసం శిక్షణ పొందాలని ఆయన సూచించారు. వ్యవసాయ కళాశాల విస్తరణ ఆచార్యులు డా. చిన్నం నాయుడు మాట్లాడుతూ కెవికెల ద్వారా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుపై శిక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నైర వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు గోవిందరావు, స్పందన, పురుషోత్తంరావు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ మన్మథరావు

పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ మీసాల మన్మథరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాధాన్యత పనుల ప్రగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 200 కంపోస్టుపిట్‌లు, ఇంటివద్ద వ్యక్తిగత సోక్‌పిట్, పొలాల్లో ఫారంపాండ్లు నిర్మాణానికి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో వెలుగు సిసిలు, విఒఎలు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రగతిని పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ పి.శ్రీనివాసరావు, ఎపిఎం రాంమూర్తి, సిసిలు, టిఎలు తదితరులు పాల్గొన్నారు.

విలీన స్ఫూర్తితో 'పైల' స్మారక సభ

ప్రజాశక్తి- పలాస

భారత విప్లవోద్యమంలో శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటానికి ప్రత్యేక రాజకీయ విశిష్టత వుందని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. పలాసలో ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అమరజీవి పైలా వాసుదేవరావుకు చరిత్రలో సుస్థిరస్థానం ఉందన్నారు. ఇటు ఉద్దానంలో పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి, పాణిగ్రాహి సుబ్బారావు, చాగంటి భాస్కరరావు, ఏజెన్సీలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వంటి సుప్రసిద్ధ విప్లవ నేతలతో పాటు వందల మంది విప్లకారులను దారుణంగా ప్రభుత్వం పొట్టనపెట్టుకున్న తర్వాత విప్లవోద్యమ పునఃనిర్మాణం ఓ కీలక కర్తవ్యంగా ముందుకు వచ్చిందని, ఆ దశలో పైలా వాసుదేవరావు కీలకపాత్ర పోషించాడన్నారు. ఆ క్రమంలో ఆయన సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా ఎదిగి అనేక ముఖ్య బాధ్యతల్ని పోషించారన్నారు. పైలా వాసుదేవరావు 15వ వర్థంతి సభను సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. వాసుదేవరావు 15వ వర్థంతి సందర్భంగా ఈ నెల 13న పలాసలో ఉదయం


మాట్లాడుతున్న ప్రసాద్

10:30 కి స్మారక ప్రదర్శన ప్రారంభమై అప్పయ్య దొరగారి ఇంటి సమీపాన గల గ్రౌండ్ (ఖాళీ స్థలం) లో బహిరంగ సభగా మారుతుందని, ఈ సభకు పార్టీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సహాయ కార్యదర్శి జుత్తు వీరాస్వామి, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ పోతనపల్లి కుసుమ, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎం. వినోద్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన అవసరం

కోటబొమ్మాళి : మిషన్ వాత్సల్యపై అవగాహన పెంచుకోవాలని దంత సర్పంచ్ గొండు చాందిని మురళీ అన్నారు. శుక్రవారం మండలం దంత మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మిషన్ వాత్సల్యపై నిర్వహించి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. దేశంలో పిల్లల రక్షణను, శ్రేయస్సును నిర్ధారించడంలో మిషన్ వాత్సల్య పథకం గణనీయమైన ప్రాముఖ్యత కలిగి ఉందని హెచ్‌ఎం గొండు నారాయణరావు తెలిపారు. పిల్లల హక్కులు, కిశోర బాలికలకు శారీరక, సామాజిక సమస్యలు, వాటి నివారణ, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, బాల్య వివాహాల నివారణపై సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు పోషకాహార అవసరంపై అవగాహన కల్పించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నరేష్, రవి, నీలవేణి, చంద్రశేఖర్, గౌరీ, చిన్నముడు, ఉపాధ్యాయులు నిర్మల, రామారావు, జ్యోతి, వేణుగోపాలరావు, గణేష్, అంగన్వాడీ కార్యకర్తలు ద్రాక్షాయిని, ద్రాక్షవేణి, రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

దంతాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యకరమైన చిరునవ్వు, శరీర ఆరోగ్యానికి రోజువారీ దంత సంరక్షణ చాలా అవసరమని దంత వైద్యనిపుణులు డాక్టర్ నిహారిక, డాక్టర్ చంద్రమౌళి అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్, ఆపిల్ ఇంటర్నేషనల్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కళాశాలలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ దశల్లో ఏర్పడే దంత సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతీ ఒక్కరు రోజుకు కనీసం రెండుసార్లు బ్రెష్ చేయాలని సూచించారు. సంవత్సరానికి కనీసం రెండుసార్లు దంతవైద్యుడిని సందర్శించి క్రమం తప్పకుండా తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థినులతో పాటు కళాశాల అధ్యాపకులు దంతాల పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, జువాలజీ విభాగం అధ్యాపకులు ఐ.హేమపద్మజ, ప్రిన్సిపాల్ కె. సూర్యచంద్రరావు, డాక్టర్ వై.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయసేవలపై విస్తృత ప్రచారం

కోటబొమ్మాళి: పత్రికలు, మీడియాలో విస్తృత ప్రచారం చేయడం ద్వారా జాతీయ లోక్ అదాలత్, ఉచిత న్యాయసహాయం, న్యాయవిజ్ఞాన సదస్సులు, వివిధ చట్టాల సారాంశాలు ప్రజలందరిలోకి తీసుకువెళ్తే గ్రామ ప్రజలు, మారుమూల ప్రాంత ప్రజలు కూడా మండల న్యాయ సేవా సంఘం ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకుని వారి జీవితాలను సుఖమయం చేసుకుంటారని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్న లత అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మే నెల 10న రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నామని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు అదేవిధంగా భార్యాభర్తల కేసులన్నీ లోక్


మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

అదాలత్‌తో రాజీ అవుతాయన్నారు. న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది, కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం బిసిలు స్వయంశక్తితో అభివృద్ధి చెందేందుకు అర్హులైన లబ్ధిదారులకు బిసి కార్పోరేషన్ రుణాలు మంజూరు చేస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ఎన్.రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బిసి కార్పోరేషన్ ధరఖాస్తులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు మంజూరైన లబ్ధిదారులు వాటిని దుర్వినియోగం చేసుకోకుండా మంచి వ్యాపార అభివృద్ధి చేసుకునేందుకు సిద్ధం కావాలన్నారు. అనంతరం 720 ధరఖాస్తులకు సుమారు 630 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సిటిమిషన్ మేనేజర్ మోహన్, వివిధ సచివాలయాల సిబ్బంది, మెప్మా సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలస గ్రామానికి చెందిన గురుగుబెల్లి లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.33 వేల సిఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో ప్రవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుడుమురు పొలినాయుడు, ఉప సర్పంచ్ జి.కృష్ణ


చెక్కు అందజేస్తున్న ప్రమీల

తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్క ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క ప్రభుత్వ కార్యాలయాలలో తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. మంచినీటితో పాటు మజ్జిగ కూడా ప్రజలకు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ సత్యనారాయణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెంటికోటలో చలివేంద్రం ప్రారంభం

పలాస: మండలం రెంటికోట మెయిన్‌రోడ్ వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సూచనలతో చలివేంద్రాన్ని రెంటికోట వైద్యాధికారి డాక్టర్ ఎస్.మౌనిక, సర్పంచ్ శాసనపురి తిరుమలరావు ప్రారంభించారు. ఈ



నరసన్నపేట : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దూరప్రాంతాలు వెళ్లేటప్పుడు, పనిచేసేటప్పుడు నాలుక పొడిబారిన, చర్మం పొడిబారిన వీలైనంతవరకు ఎక్కువగా నీటిని తీసుకోవాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీని ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్, కార్యదర్శి సద్గుణరావు, మహిళా పోలీస్ వాసంతి, టిడిపి నాయకులు కరియామంత్ర, పిహెచ్‌ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు రిషికేశ్వరరావు, ఈశ్వరమ్మ, యుడిసి సుదర్శన్, విమల, ప్రభావతి, త్రివేణి, యోగేశ్వరి పాల్గొన్నారు.


కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

వేడుకగా వార్షికోత్సవం

ప్రజాశక్తి- కవిటి

ప్రగడపుట్టుగ కూడలిలో ఉన్న గుండమ్మ తల్లి మొదటి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కచేరి ఆహుతలను అలరించింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు

సక్రమంగా గ్రామసభల నిర్వహణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో ఈ నెల 14న నిర్వహించనున్న గ్రామసభలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు పైడి ఏకాంబేశ్వరరావు, సనపల రాంబాబు ఎంపిడిఒ రోణంకి వెంకటరావును కోరారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గ్రామసభల్లో చోటు చేసుకున్న లోపాలను సవరించాలని, ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 791 ప్రకారం అజెండా రూపొందించి గ్రామసభలకు అధికారులంతా హాజరయ్యేలా చూడాలని కోరారు.

ఉత్తమ పాత్రికేయులకు ఉగాది పురస్కారాలు


రంగనాయకులు

కవిటి: అక్షరాస్త్రాలతో సమాజాన్ని చైతన్య పరిచే బృహత్తర బాధ్యతను నిర్వర్తిస్తున్న పాత్రికేయులకు ఉగాది పురస్కారాలతో సత్కరించ నున్నట్లు తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 100 మంది ఉత్తమ పాత్రికేయులకు ఏప్రిల్ 12న విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో పురస్కారాలు అంద జేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత సుప్రీంకోర్టు 48వ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకట రమణ ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథులుగా రాష్ట్ర మంత్రి, ప్రముఖ సినీ నటుడుతో పాటు నిర్మాత, పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. పురస్కార గ్రహీతలకు రూ.5వేలు నగదుతో కూడిన పురస్కారం, ప్రశంసాపత్రం, రూ.20 లక్షల ప్రమాద బీమా అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇరు రాష్ట్రాల పాత్రికేయులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముత్యాలమ్మ తల్లి జాతర పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం: మండల కేంద్రంలో గ్యాస్ గొడౌన్ వెనుక ఉన్న శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి జాతర ఈ నెల 8 నుంచి 10 వరకు జరుగనుంది. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన పోస్టర్‌ను కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. కమిటీసభ్యులు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి కళావేదిక భవణాన్ని మేమున్నాం సేవా సంఘం అధ్యక్షులు పచ్చిగుళ్ల సాయిరాం, ఎంపిటిసి దేవయాని దంపతుల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, శివారు భూములకు సాగునీరు అన్న అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఈనెల ఐదో తేదీన నిర్వహిస్తున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఉదయం పది గంటలకు నిర్వహించే సమావేశంలో పలు ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజక్టులపై చర్చించనున్నట్లు తెలిపారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రమైన కొత్తూరులో శుక్రవారం టిడిపి కార్యాలయాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయి గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు క్రమశిక్షణకు మారు పేరన్నారు. అలాగే వారానికి రెండు రోజులు స్థానిక కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు. ఏమైనా సమస్యలుంటే చర్చించుకుని పరిష్కారం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అరుణ్‌కుమార్, మాధవరావు, మాతల గాంధీ, గోగుల వర ప్రసాదరావు నాయుడు, పి.లక్ష్మణరావు, టి.తిరుపతిరావు, దాసునాయుడు, కుంచాల నూకరాజు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ మనీశ్వరి

నాటుసారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రోహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు మాట్లాడుతూ సారారహిత గ్రామాలను తయారు చేయాలన్నారు. అలాగే అందరూ నాటుసారాకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో ఎక్సైజ్ సిఐ మనీశ్వరి, ఎంపిడిఒ పి.నీరజ, సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- పాతపట్నం

అమరజ్యోతి పాఠశాలలో శుక్రవారం హైస్కూల్ విభాగం 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు యాన్యువల్ డే సెలెబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ఆటపాటలతో, సందేశాత్మక నాటికలతో తల్లిదండ్రులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిరణ్మయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైల జగన్నాధరావు, కెమిస్ట్రీ అధ్యాపకులు కిల్లారి గోవిందరావు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.సోమేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇప్పిలి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కొఠారి చండీమాత యాత్ర

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం కొఠారి చండీమాత యాత్ర వింధ్యగిరి గ్రామంలో శనివారం వైభవోపేతంగా జరగనుందని నిర్వాహకులు తెలిపారు. గతంలో ఒడిశా రాజ వంశీయుల దీపారాధనతో ప్రారంభమయ్యే ఈ యాత్ర ప్రస్తుతం స్థానికంగా ఉండే పుల్లట, ఫాడి, ఒరియా బ్రాహ్మణ కుటుంబాల దీపాలతో ప్రారంభమవుతుంది. ఆంధ్రా, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే ఈ యాత్రలో శుక్రవారం సాయంత్రం నుంచే ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు వింధ్యగిరి చేరుకుని యాత్రలో పాల్గొంటారు. తమకు పుట్టే మొదటి బిడ్డ కొప్పు చండీమాత వద్దనే తీయాలనేది ఒడిశా వాసుల సంప్రదాయం, ఆచారం, నమ్మకం. దానికి అనుగుణంగా దేశ విదేశాల్లో స్థిరపడిన ఒడిశా వాసులు కూడా వింధ్యగిరి యాత్రలో పాల్గొని చండీమాతకు మొక్కులు చెల్లించుకుంటారు.